క్లుప్తంగా

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణ ధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

నలుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

రూ.20,360 స్వాధీనం

సబ్బవరం: మండలంలోని ఇరువాడ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని సబ్బవరం పోలీసులు శుక్రవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.20,360 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ పిన్నంటి రమణ తెలిపారు.ముందస్తు సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



రెడ్‌క్రాస్ సొసైటీ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న దాతలు

పరవాడ: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, లారెన్స్ అండ్ మయో ఐ క్యాంపు సౌజన్యంతో యాక్సెస్ట్ ఎన్జీవో ఆధ్వర్యంలో ఎన్టీపీసీ జీఈ పవర్ ప్లాంటులో శనివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది.రక్తదాన శిబిరంతో పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. 32 మంది నుంచి రక్తాన్ని సేకరించారు. 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జీఈ పవర్ ఇండియా ప్రాజెక్టు మేనేజర్ పి.విజయకుమార్, ఈహెచ్ఎస్ మేనేజర్ ఎస్.మణికందన్, యాక్సెస్ట్ ప్రొగ్రాం మేనేజర్ ఢిల్లీశ్వరి, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి మురళి పాల్గొన్నారు.


వెంకన్నకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, అష్టోత్తరం, దూపసేవ, దీపోత్సవం చేశారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

సోమేశ్వరస్వామి ఆదాయం రూ.10.15 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

పెదగంట్యాడ: అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయానికి రెండు రోజుల్లో రూ.10,15,746 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో జగన్నాథం తెలిపారు. టికెట్ల రూపంలో రూ.4,02,180, ప్రసాదం అమ్మకాల ద్వారా రూ.2,77,980, హుండీ ఆదాయం రూ.3,15,586, కొబ్బరి చిప్పల వేలం ద్వారా రూ.20వేలు వచ్చిందని వివరించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
✆ 9885181097

ఇక హాయిగా..

- చీమలాపల్లి వద్ద అధునాతన డంపింగ్ యార్డు
- రూ.11.82 కోట్లతో నిర్మించిన జీవీఎంసీ
- దుర్గంధం కష్టాలకు చెల్లు
- చీమలాపల్లి, వేపగుంట ప్రాంత వాసుల హర్షాతిరేకాలు



నాడు: చీమలాపల్లి వద్ద ఆరు బయట వేసిన చెత్త



నేడు: రూ.11.82 కోట్లతో నిర్మించిన అధునిక డంపింగ్ యార్డు

నాడు: భరించలేని దుర్గంధం..విపరీతమైన దోమలు..ఈగలు..దుర్వాసన కారణంగా ముద్ద దిగని దుస్థితి.. ఇదీ కొన్నాళ్ల కిందట వేపగుంట ప్రాంతంలోని చీమలాపల్లి, వరలక్ష్మినగర్, ఇతర కాలనీల వాసుల పరిస్థితి. ఆరుబయట డంపింగ్‌యార్డు వల్ల ఈ ప్రాంత వాసులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారు. దాన్ని అక్కడి నుంచి తరలించాలని వినతులు ఇచ్చారు. ఆందోళనలు చేశారు. కానీ నాడు టీడీపీ ప్రభుత్వం వారి ఆవేదనను పట్టించుకున్న పాపాన పోలేదు.

నేడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ఇక్కడి డంపింగ్ యార్డుపై దృష్టి సారించింది. 2022లో కార్పొరేటర్ ముమ్మన దేముడు చొరవతో ఇక్కడ అధునాతన డంపింగ్ యార్డు నిర్మాణానికి జీవీఎంసీ పూనుకుంది. వెంటనే రూ.11.82 కోట్లు నిధులు విడుదల చేసి సీసీఎస్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్(డంపింగ్ యార్డు యూనిట్) నిర్మాణం చేపట్టారు. దీన్ని సోమవారం ప్రారంభించనున్నారు. దీంతో తమ వెతలు తీరాయని ఇక్కడి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెందుర్తి: జీవీఎంసీ జోన్–8 పరిధిలోని వందలాది కాలనీల్లో సేకరించిన చెత్తను జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి సమీపంలోని డంపింగ్ యార్డుకు తరలించేవారు. ఆ చెత్తను ఆరు బయటే వేసే వారు. దీంతో చెత్త కుళ్లిపోయి విపరీతమైన దుర్గంధం వచ్చేది. దోమలు, ఈగలు పెరిగిపోయి స్థానికంగా నివాసం ఉండే వేలాది మంది ప్రజలు తీవ్ర అవస్థలు పడేవారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జీవీఎంసీ పాలకవర్గం కొలువుదీరగానే స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు డంపింగ్‌యార్డు సమస్యపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇక్కడి పరిస్థితిని జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. పరిస్థితిని స్వయంగా తెలుసుకున్న జీవీఎంసీ అధికారులు రూ.11.22 కోట్లు విడుదల చేశారు. అధునాతన డంపింగ్ యార్డు నిర్మించారు.

నిర్మాణం ఇలా

ఆధునిక డంపింగ్ యార్డులో రెండు భారీ గల్లాలు ఏర్పాటు చేశారు. ఆయా గల్లాల్లోకి జీవీఎంసీ చెత్త వాహనాల ద్వారా తీసుకువచ్చిన తడి, పొడి చెత్త వేస్తారు.

- ఇక్కడ రసాయన ప్రక్రియ వల్ల చెత్త నుంచి ఎక్కడా దుర్వాసన రాదు. దోమల వ్యాప్తి ఉండదు.
- అలా సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు నగరంలోని కాపులుప్పాడలో ఉన్న జీవీఎంసీ ప్రధాన డంపింగ్‌యార్డుకు తరలిస్తారు.
- ఈ యూనిట్‌ను ఇక్కడ ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలకు ఎటువంటి కాలుష్యం , దుర్వాసన గానీ, ఇతర అనారోగ్యాలు తలెత్తే పరిస్థితి ఉండదు.



యూనిట్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు , అధికారులు(ఫైల్)

ప్రభుత్వానికి ధన్యవాదాలు



ఆరుబయట డంపింగ్ యార్డు ఉండడం వల్ల చాలాకాలం పాటు తీవ్ర అవస్థలు పడ్డాం. అక్కడి నుంచి వచ్చే దుర్వాసన, దోమలు, ఈగల వల్ల అనారోగ్యం పాలయ్యేవాళ్లం. ఇప్పుడు కొత్తగా డంపింగ్‌యార్డు నిర్మించడం వల్ల మాకు ఎంతో ఊరటగా ఉంది. ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు.

– మూల వేణి, వరలక్ష్మినగర్ వాసి, వేపగుంట

ప్రజలకు మేలు చేశారు



ఆరు బయట డంపింగ్‌యార్డు ఉండడం వల్ల దుర్వాసనతో చాలా ఇబ్బందులు పడేవాళ్లం. దుర్వాసన వల్ల తిండి కూడా సహించేది కాదు. అనారోగ్యం పాలయ్యే వాళ్లం. ఇప్పుడు ఈ యార్డు నిర్మాణం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరిగింది. కార్పొరేటర్ ముమ్మన దేముడు కృషి అభినందనీయం.

– బొడ్డు దేముడుబాబు, స్థానికుడు

త్వరలో ప్రారంభిస్తాం



మా పాలకవర్గం ఏర్పడిన వెంటనే ఇక్కడి పరిస్థితిని మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లాను. వెంటనే వారు స్పందించి నిధులు మంజూరు చేశారు. పనులు కూడా చకచకా జరిగిపోయాయి. మేయర్, కమిషనర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. ఒకటి రెండు రోజుల్లో ఈ యూనిట్‌ను ప్రారంభిస్తాం.

– ముమ్మన దేముడు, కార్పొరేటర్, 95వ వార్డు

క్రీడా పోటీల విజేతలకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల చైర్మన్ సూర్యనారాయణరెడ్డి

పరవాడ: గోపాలపట్నం జెడ్పీ పాఠశాలలో ఈ నెల 1 నుంచి 3 వరకు జరిగిన మూడో సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు రెండు బంగారు, ఒక కాంస్య పతకం సాధించినట్టు పాఠశాల చైర్మన్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. హర్షిత, జి. హర్షితబంగారు పతకాలు, ఆర్.రేవంత్ కాంస్య పతకం సాధించారని చెప్పారు. వీరు ఉత్తరప్రదేశ్ నోయిడా నగరంలో ఈ నెల 19 నుంచి 25 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం దక్కిందని పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు చెప్పారు. ఈ మేరకు విద్యార్థులను అభినందించారు.

భద్రత, పర్యావరణంపై ప్రత్యేక దృష్టి

- ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నారావు
- ముగిసిన జాతీయ భద్రత వారోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎన్టీపీసీ ఉన్నతాధికారులు

పరవాడ: భద్రత, పర్యావరణంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చిన్నారావు సూచించారు. జాతీయ భద్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా సింహాద్రి ఎన్టీపీసీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ విభాగంలో సింహాద్రి ఎన్టీపీసీ చేస్తున్న కృషిని అభినందించారు. భద్రత, ఆరోగ్యం, పర్యావరణ సమస్యలపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఓ అండ్ ఎం జీఎం సురేష్ జాన్‌డేవిడ్ మాట్లాడుతూ సింహాద్రిలో ప్రమాద రహిత పని వాతావరణాన్ని పెంపొందించడానికి యాజమాన్యం కట్టుబడి ఉందన్నారు. ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని ఉద్యోగులు, కార్మికులు ఆపరేషన్ జీఎం టి.ఆర్.రాజగోపాలన్ చెప్పారు. భద్రత వారోత్సవాల్లో ఉద్యోగులు, పాఠశాలల పిల్లలకు నిర్వహించిన వ్యాసరచన, భద్రత పోటీలు, సేఫ్టీ క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీఎం పద్మప్రియ, హెచ్ఆర్ హెడ్ బి.బి పాత్ర, సీఐఎస్ఎఫ్, కాంట్రాక్టు అసోసియేషన్లు ఉద్యోగులు పాల్గొన్నారు.

కనుల పండువగా సామూహిక రుద్రాభిషేకం



విశేష అలంకరణలో ఉమా చంద్రమౌళీశ్వరస్వామి

అల్లిపురం : అస్సాం గార్డెన్స్‌లో గల శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం లింగోద్భవ కాలంలో పరమ శివునికి మహాన్యాసపూర్వక సామూహిక రుద్రాభిషేకం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు భార్గవ శర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, విభూది, గంధం, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో రుద్రాభిషేకాన్ని రుత్వికులు చేపట్టారు. అనంతరం ఉమాచంద్రమౌళీశ్వరస్వామిని విశేషంగా అలంకరించి ఏక హారతి నుంచి నక్షత్ర హారతి, కర్పూర హారతి వైభవంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.


వాకర్స్ క్లబ్‌లోకి ఆహ్వానం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ వరలక్ష్మి

మద్రిపాలెం: మురళీనగర్ వాకర్స్ క్లబ్ నెలవారీ సర్వసభ్య సమావేశాన్ని శనివారం క్లబ్ సభా ప్రాంగణంలో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించారు. పర్యావరణానికి ప్రాధాన్యమిస్తూ, క్రమశిక్షణ కార్యాచరణతో కొనసాగుతున్న వాకర్స్ క్లబ్‌లో నూతన సభ్యులకు ఆహ్వానం పలుకుతున్నామని నిర్వాహకులు తెలిపారు. సీనియర్ సభ్యుల వారసులు, స్థానికులు ఎవరైనా చేరవచ్చని, క్లబ్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథి న్యాయ విశ్వవిద్యాలయం ఆచార్యులు పి.వరలక్ష్మి మాట్లాడుతూ మధ్య తరగతి ప్రజలు ఎదుర్కొనే న్యాయ సంబంధమైన వివాదాలపై సందేహాలు, వాటి పరిష్కారాలపై వివరించారు. వీలునామా తదితర విషయాలను తెలియజేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా వరలక్ష్మిని క్లబ్ సభ్యులు సత్కరించారు. నూతన సభ్యుల చేత వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం ప్రమాణ స్వీకారం చేయించారు. వాకర్స్ జిల్లా 101 ఎలెక్ట్ గవర్నర్ ద్వారకానాథ్ వాకర్స్ క్లబ్ మాసపత్రిక 'వాకర్స్ వాయిస్' మార్చి నెల సంచికను ఆవిష్కరించారు. క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కూర్మన్నపాలెం: పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. భావితరాలకు కాలుష్య రహిత, ప్లాస్టిక్ ఫ్రీ సమాజాన్ని అందించడమే లక్ష్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై 87వ వార్డు తిరుమలనగర్ చిల్డ్రన్స్ పార్కులో సందర్శకులకు సంక్షేమ సంఘం ప్రతినిధులు శనివారం అవగాహన కల్పించారు. ప్రజలందరూ ప్లాస్టిక్ సంచులకు బదులు స్టీల్ బాక్సులు, నార సంచులను ఉపయోగించాలని, విధిగా మొక్కలు నాటాలని కోరారు. తడి చెత్త నుంచి కంపోస్ట్ ఎరువుగా మార్చాలని, ఇంకుడు గుంతలను తవ్వి భూగర్భ జలాలను సంరక్షించాలని విజ్ఞప్తి చేశారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ఎకో వైజాగ్ లక్ష్యాలు సాధించి, రాబోయే స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో విశాఖ నగరానికి మొదటి ర్యాంకు రావడానికి ప్రజలందరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, భాస్కరరావు, తిరుపతిరావు, మన్మథరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సబ్బవరం:సబ్బవరంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు ఈ నెల 12వ తేదీ నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కేజీబీవీ ఎస్‌వో మృదుల ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతితో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. వీటితో పాటు 7,8,9 తరగతుల్లో మిగిలిపోయిన సీట్లకు కూడా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.అనాథలు,బడి మానేసిన పిల్లలు,ఎస్సీ,ఎస్టీ ,బీసీ,మైనార్టీ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6వ తరగతిలో ప్రవేశాలకు–40 సీట్లు,ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు–40 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలియజేశారు.

ఉత్సాహంగా డ్యాన్స్ పోటీలు



విజేతలతో ఉపాధ్యాయులు

పెందుర్తి: భాష్యం విద్యా సంస్థల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జోనల్ లెవల్ డ్యాన్స్ పోటీలు ఉత్సాహభరితంగా ముగిసాయి. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు పాల్గొనగా పెందుర్తి బాయ్స్, గర్ల్స్ బృందాలు, అనకాపల్లి, సాలూరు బ్రాంచ్‌ల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. శనివారం వేపగుంటలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో వర్ధమాన డ్యాన్స్ కొరియో గ్రాఫర్ సాహిద్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల భవిష్యత్తు కోసం ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1122వ రోజు, శనివారం సంస్థకు చెందిన సింటర్ ప్లాంట్ విభాగ కార్మికుల పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో కార్మికులు పట్టు వదలకుండా పోరాటాన్ని కొనసాగిస్తున్నారని, ఇది దేశ చరిత్ర పుటల్లో నిలిచిపోతుందని అన్నారు. విశాఖ ఉక్కు ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని ప్రధాని నరేంద్రమోదీ స్పష్టమైన ప్రకటన చేసేంత వరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఏయూ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం జియాలజీ విభాగం విద్యార్థులను వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అభినందించారు. ప్రాంగణ నియామకాలలో భాగంగా విభాగ విద్యార్థులు ఎస్.వి.పి భాగ్యశ్రీ, షేక్ అబిదలు జెడ బల్యూస్ సంస్థలో, ఆర్.స్వరూప ఏక్సెంచర్ సంస్థలో ఎంపికయ్యారు. విభాగ విద్యార్థి ఎస్.పవన్ యూపీఎస్సీ నిర్వహించిన పరీక్షలో జియో సైంటిస్ట్‌గా ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థులను వీసీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, జియాలజీ విభాగాధిపతి ఆచార్య కె.సత్యనారాయణ రెడ్డి, బీవోఎస్ చైర్మన్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయ రావు తదితరులు పాల్గొన్నారు.

పుణ్యస్నానాలకు పోటెత్తిన భక్త జనం



ముత్యాలమ్మపాలెం తీరంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



ఆకట్టుకున్న బాలల సాంస్కృతిక కార్యక్రమం



శివుడిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పరవాడ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ముత్యాలమ్మపాలెం తీరానికి శనివారం భక్తులు పోటెత్తారు. ముందు రోజు రాత్రి భక్తులు జాగరణ చేసి శనివారం వేకువ జాము 4 గంటల నుంచి తీరంలో పుణ్య స్నానాలు ఆచరించడానికి తరలివచ్చారు. వేలాది మంది భక్తులు తీరంలో స్నానాలు ఆచరించి సమీపంలో కొలువుదీరిన శివుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మహాశివరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు శివాలయం వద్ద ఏర్పాటు చేసిన తప్పెటగుళ్లు, చిడతలు వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

పోలీసుల నిఘా

మహాశివరాత్రి సందర్భంగా తీరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా సీఐ ఎస్.బాలసూర్యారావు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తుల మధ్య పోలీసులు మఫ్టీలో తిరిగారు. సముద్రంలోపలికి భక్తులు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ముందస్తుగా గజఈతగాళ్లను నియమించి భక్తులకు రక్షణ కల్పించారు.

స్థానిక గ్రామ సచివాలయ కన్వీనర్ బొంది అచ్చిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన మహాశివరాత్రి వేడుకల్లో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, నాయకులు పల్లా గోవిందు శివుడిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చిన మసేను, స్వీడు మసేను, దూడ అప్పారావు, నల్ల మసేను, కోవిరి నూకరాజు, బంగార్రాజు, సమ్మింగి హరీష్ పాల్గొన్నారు.

- విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నగర ఉపాధ్యక్షుడు అన్నెం బాబ్జీ, సహాయకార్యదర్శి కె.శ్రీనివాసరావు, పూల వెంకటేశ్వరరావు, మోస రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



దుర్గాలమ్మ ఊరేగింపు



భక్తజన సందోహం

డాబాగార్డెన్స్ : పూర్ణామార్కెట్ దరి వెలంపేటలో వెలసిన దుర్గాలమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం జాతరను పురస్కరించుకుని ఆలయానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత అమ్మవారికి వైభవంగా నేత్రోత్సవం, తొలిపూజ నిర్వహించారు. వేకువ జాము నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భవానీ మాలలు వేసిన మాతలు కలశాలతో పసుపు కుంకుమ నీళ్లతో ఊరేగింపుగా ఆలయానికి విచ్చేసి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో అగ్నిగుండాలు తొక్కే కార్యక్రమం జరిపారు. సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గత వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతర మహోత్సవాలు శనివారంతో ముగిసాయి.

16న మారువారం..

అమ్మవారి మారువారాన్ని పురస్కరించుకుని ఈ నెల 16న 108 రకాల వంటకాలతో అమ్మవారికి నివేదించిన అనంతరం భక్తులకు ప్రసాదంగా అందజేయనున్నారు. 17 మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం వద్ద ఐదు వేల మంది భక్తులకు మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
✆ 9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com